


హరిహర క్షేత్రంలో కుంకుమార్చనలు

అచ్చంపేట: హరిహర క్షేత్రంలోని గిరిజా భ్రమ రాంబ సమేత మల్లికార్జునస్వామి గుడిలో సోమవారం సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: పానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహోత్సవాల ఆహ్వాన పత్రికలను సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,217 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

సైనికుల పతాక నిధికి విరాళాలు ఇవ్వండి



నరసరావుపేట: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తున్న సైనికులు, ప్రాణ త్యాగం చేసిన సైనిక కుటుంబాలు, మాజీ సైనికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సాయుధ దళాల పతాక నిధికి అన్ని వర్గాల ప్రజలు విరాళాలు అందించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు విజ్ఞప్తి చేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా సైనిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, పోస్టర్స్, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళితో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సైనిక పతాక దినోత్సవం, నిధి ఏర్పాటు ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, డీపీఓ ఎంవీ భాస్కరరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమాధికారి గుణశీల పాల్గొన్నారు.

శిల్పారామం పరిశీలన



గుంటూరు రూరల్: గుంటూరు శిల్పారామాన్ని సోమవారం రాష్ట్ర శిల్పారామాల నూతన సీఈవో వి.స్వామినాయుడు, నూతన చైర్ పర్సన్ చెరెడ్డి మంజుల రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ, ఫీల్డ్ సిబ్బందితో సీఈవో మాట్లాడారు. శిల్పారామం మొత్తం తిరిగారు. స్టాల్స్, బోటింగ్ పాండ్, గార్డెన్ పరిశీలించారు. బోటింగ్ పాండ్ ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదుల పుస్తకాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచాలని, వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శిల్పారామం ఏవో శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, డీఈవో భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 39,843 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శనివారం 39,843 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 35,352 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ.14,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 37,418 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

ధనుర్మాస ప్రచార వాహనాలు ప్రారంభం



తాడేపల్లి రూరల్: ధనుర్మాసం ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ప్రచార వాహనాలను శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి సోమవారం ప్రారంభించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ దేవదాయ కమిషనర్ ఎస్. సత్యనారాయణ సోమవారం దర్శించారన్నారు. ఆయనకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి తీర్థప్రసాదాలతో పాటు మంగళా శాసనం అందజేశారని తెలిపారు. ఈనెల 16నుంచి జనవరి 13వరకు ధనుర్మాస కార్యక్రమాలను మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళాశాసనాలతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాత అలైన్‌మెంట్‌కే జై !

- భూములిచ్చేందుకు కొందరు రైతులు నిరాకరణ
- ఓ ప్రజాప్రతినిధి ద్వారా అలైన్‌మెంట్ మార్పుకు యత్నాలు
- కొన్ని నెలలుగా భూసేకరణకు అడ్డు
- సీఎం చంద్రబాబు దగ్గరకు పంచాయితీ
- అలైన్‌మెంట్ మారిస్తే నిర్మాణ వ్యయం, సమయం పెరుగుతుందన్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు
- పాత డీపీఆర్ ప్రకారమే రోడ్డు వెళ్తుందని, ఎవరూ జోక్యం చేసుకో కూడదని సీఎం ఆదేశాలు
- భూసేకరణకు రెవెన్యూ అధికారులు సిద్ధం

నరసరావుపేట వద్ద నిలిచిన వాడరేవు- నకరికల్లు జాతీయ రహదారి పనులు



వాడరేవు-నకరికల్లు 167ఏ జాతీయ రహదారి నిర్మాణం కోసం వేసిన మార్కింగ్

సాక్షి, నరసరావుపేట: వాడరేవు-నకరికల్లు 167ఏ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మారుతోందంటూ గత కొన్ని రోజులుగా జరుగుతోన్న ప్రచారానికి, యత్నాలకు శుభం కార్డు పడిందని సమాచారం. పాత అలైన్‌మెంట్ ప్రకారమే హైవే నిర్మాణం జరుగుతుందని, ఎలాంటి మార్పూ లేదని ఉన్నత స్థాయి వర్గాలు చెబుతున్నాయి. వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు జరుగుతున్న ప్యాకేజీ-1 పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సుమారు రూ.825 కోట్లతో 47 కిలోమీటర్ల మేర ఈ పనులు గతేడాది ప్రారంభమయ్యాయి. మరోవైపు ప్యాకేజీ-2లో భాగంగా జరగాల్సిన చిలకలూరిపేట నుంచి నకరికల్లు వరకు రహదారి విస్తరణ ముందుకు సాగలేదు. నరసరావుపేట రూరల్ మండల పరిధిలో వెళ్తున్న నరసరావుపేట బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. విలువైన భూములను హైవే నిర్మాణానికి ఇచ్చేది లేదంటూ కొందరు రైతులు నిరాకరించారు. ఎలాగైనా అలైన్‌మెంట్ మార్చాలంటూ వారికి అనుకూలంగా ఉండే ఓ ప్రజాప్రతినిధి ద్వారా యత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా డీపీఆర్ మార్చేందుకు అవసరమైతే చందాలు వేసుకునేందుకు కూడా రైతులు సమావేశాలు నిర్వహించారు.

సీఎం దగ్గరకు చేరిన పంచాయితీ

వాడరేవు-నకరికల్లు జాతీయ రహదారి ప్యాకేజీ-2లో భాగంగా నరసరావుపేట పట్టణం నుంచి కాకుండా రూరల్ నుంచి బైపాస్ రోడ్డును ప్రతిపాదించారు. కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సప్పాలెం, రావిపాడు గ్రామాల మీదుగా బైపాస్ నిర్మించేలా డీపీఆర్ రూపొందించారు. ఇందులో భాగంగా రెవెన్యూ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సేకరించాల్సిన భూముల్లో రాళ్లు సైతం పాతారు. కొందరు రైతులు ఆందోళనలు చేయడం, అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేయడంతో భూసేకరణలో జాప్యం జరిగింది. ఇటీవల సీఎం చంద్రబాబు వద్ద జాతీయ రహదారుల అధికారులతో జరిగిన సమీక్షలో ప్యాకేజీ-2లో జరుగుతున్న జాప్యం అంశం చర్చకు వచ్చిందని సమాచారం. రైతులు కోరుతున్న విధంగా అలైన్‌మెంట్ మార్చడం కష్టమని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సీఎంకు తేల్చిచెప్పారట. కొందరు రైతులు, ఓ ప్రజాప్రతినిధి చెబుతున్న కొత్త అలైన్‌మెంట్ ప్రకారమైతే దూరం, వ్యయం పెరుగడంతో పాటు నిర్మాణం ఆలస్యమవుతుందని నివేదిక ఇచ్చారట. దీంతో సీఎం చంద్రబాబు పాత అలైన్‌మెంట్ ప్రకారమే బైపాస్ నిర్మాణం చేయాలని, ప్రజాప్రతినిధులెవరూ ఈ విషయంలో జోక్యం చేసుకోకూడదని హెచ్చరించినట్టు తెలుస్తోంది. దీంతో పాత అలైన్‌మెంట్ ప్రకారమే బైపాస్ నిర్మాణం జరుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

చేతులెత్తేసిన ప్రజాప్రతినిధి

ఈ బైపాస్ రోడ్డుకు కొంతమంది రైతులు మాత్రమే అడ్డుచెబుతున్నారు. మిగిలిన రైతులు తమ ప్రాంతం మీదుగా బైపాస్ రోడ్డు వెళ్తే గ్రామానికి విలువ పెరుగుతుందని, కొంత భూమి రోడ్డు నిర్మాణానికి పోయినా మిగిలిన భూమిలో లాజిస్టిక్ హబ్‌లు వంటివి ఏర్పాటు చేసుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు. రెండు రోజుల క్రితం బైపాస్ రోడ్డును వ్యతిరేకిస్తున్న రైతులు చివరి ప్రయత్నంగా సదరు ప్రజాప్రతినిధిని కలవగా తన చేతుల్లో ఏమీ లేదని, పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు నిర్మాణం జరుగుతుందని చేతులెత్తేశారట. మరోవైపు పాత అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమైనట్టు తెలుస్తోంది.



అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి కాలువలో వదులుతున్న భక్తులు

కార్తిక కాంతులు

కార్తిక మాసం ముగింపును పురస్కరించుకొని సోమవారం భక్తులు పోలి స్వర్గం పూజలు నిర్వహించారు. అరటి దొప్పల్లో వెలిగించిన దీపాలను కాలువల్లో వదిలారు. పాడ్యమి పురస్కరించుకొని వివిధ ఆలయాలల్లో పూజలు జరిపారు. పాతూరులోని భీమలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

– నరసరావుపేట ఈస్ట్



అన్నాభిషేక అలంకరణలో భీమలింగేశ్వరస్వామి

పాడ్యమి పూజలతో ముగిసిన కార్తిక మాసం

అమరావతి: ప్రథమారామం అమరావతి క్షేత్రంలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తికమాసం చివరిరోజు భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. కార్తిక అమావాస్య అనంతరం పాడ్యమి పర్వదినాన ఆలయాన్ని సందర్శించిన భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద దీపాలను వెలిగించారు. నదిలో దీపాలను వదిలి పోలిని స్వర్గానికి పంపే కార్యక్రమం నిర్వహించారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీ అమ్మవారికి పూజలు చేశారు. కార్తిక మాసం ఆఖరిరోజు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. ఆలయ ఈవో సునీల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమరేశ్వరునికి ప్రాతఃకాల పూజలు



గ్రామోత్సవంలో పల్నాటి వీరుల ఆయుధాలు

వీర 'మంద'హాసం

- ఉత్సాహంగా మందపోరు ఉత్సవం
- గ్రామోత్సవం.. కత్తిసేవలు
- వీరుల ఆయుధాలకు నీరాజనం
- కొనసాగుతున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో జరుగుతున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం మందపోరు ఘట్టం ఆద్యంతం ఆసక్తిగా జరిగింది. తొలుత వీరుల గుడి నుంచి పల్నాటి వీరాచారులు ఆయుధాలతో గ్రామోత్సవం ప్రారంభించారు. కత్తి సేవల అనంతరం చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద కత్తి సేవలు నిర్వహించారు. గ్రామోత్సవంలో ఆయుధాలకు ప్రజలు నీరాజనాలు పట్టారు. చాలా మంది వేంకటేశ్వరస్వామి చిత్రపటంతో డోలు, సన్నాయి మేళంతో వీరుల ఆయుధాల చెంతకు వచ్చి దీవెనలు పొందారు. వీరాచార మహిళలు వీరుల గుడిలో పొంగళ్లు తయారు చేసుకుని వీర్ల బుట్టలతో చెన్నకేశవస్వామి, అంకాలమ్మను దర్శించుకున్నారు. వీరులు కత్తిసేవలు కొనసాగించారు. పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి వెళ్లి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

బ్రహ్మనాయుడు ఆదర్శం అమలు

అలనాడు బ్రహ్మనాయుడు అమలు చేసిన చాపకూడు సహపంక్తి భోజనాలను గుర్తు చేసుకుంటూ బ్రహ్మనాయుడు చాపకూడు మండపంలో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ముఖ్య అతిథులంతా వీరుల గుడిలోని ఆయుధాలను, అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బ్రహ్మనాయుడు, మాచర్ల సైన్యాధ్యక్షుడు కన్నమదాసు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మందపోరు కథాగానం

సోమవారం రాత్రి వీరుల గుడిలో మందపోరు కథాగానాన్ని వీర విద్యావంతులు ఆలపించారు. మలిదేవుడు బ్రహ్మనాయుడు పరివారం అరణ్యవాసం చేస్తుండగా జరిగిన మందపోరు కథను ఆలపించారు. మలిదేవుని ఆలమందలను నాగమ్మ ప్రోద్బలంతో అడవి చెంచులు దారి మళ్లించేందుకు యత్నించడం అప్పుడు అడవి చెంచులు, ఆలమందల కాపర్ల మధ్య జరిగిన యుద్ధాన్ని వివరిస్తూ కథాగానం చేశారు.

నేడు కోడిపోరు

పల్నాటి వీరారాధన ఉత్సవాలలో ప్రధానమైన కోడిపోరు ఘట్టం మంగళవారం జరగనుంది. అలనాడు బ్రహ్మనాయుడు, నాయకురాలు నాగమ్మల మధ్య జరిగిన కోడిపోరును సంప్రదాయం కోసం నిర్వహించనున్నారు. బ్రహ్మనాయుడు వేషంలో పీఠాధిపతి, నాయకురాలు వేషంలో వీరాచారుడు చెరోవైపు ఉండి దీనిని నిర్వహిస్తారు. ఎమ్మెల్యేతోపాటు పలువురు ప్రభుత్వ పెద్దలు కార్యక్రమంలో పాల్గొననున్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ అరుణ్, ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు

కాకినాడ పోర్టుకు బియ్యం తరలిస్తోంది కూటమి నేతలే

- అధికారంలో ఉండి వైఎస్సార్ సీపీపై ఆరోపణలా?
- ఇంకా మాపై నిందలు వేస్తే ప్రజలు సహించరు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా కాకినాడ పోర్టు బియ్యం విషయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఎన్డీఏ కూటమి నాయకులు ఆరోపణలు చేయటం ఎంతవరకు సమంజసమని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కాకినాడ పోర్టుకు బియ్యం తరలిస్తోంది కూటమి నాయకులేనని, లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా పాట పాడుకొని దారి మళ్లిస్తోందీ వారేనని స్పష్టం చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం గోపిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం ఇతర దేశాలకు అక్రమ రవాణా కావడానికి వైఎస్సార్ సీపీ నాయకులే కారణమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించడం అవివేకమని గోపిరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడు నెలలుగా రాష్ట్రంలో పాలన సాగిస్తోందని, అధికారులందరినీ తమకు అనుకూలమైన వారిని వేసుకుందని, ఇంకా వైఎస్సార్ సీపీపై నిందలు ఎలా వేస్తారని గోపిరెడ్డి ప్రశ్నించారు. కాకినాడ పోర్టుకు బియ్యం చేరుతున్నాయంటే ప్రభుత్వం చేతకానితనం కాదా అని ధ్వజమెత్తారు. పోర్టు దాకా రేషన్ బియ్యం ఎలా చేరుతున్నాయో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. బియ్యం రవాణా అధికారులు, పౌరసరఫరాల శాఖ, పోలీసులకు తెలియకుండా జరుగుతుందా అని అడిగారు. ఒక్కొక్క ఊర్లో ఈ రేషన్ బియ్యాన్ని రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు తెలుగుదేశం పార్టీ వారే పాట పాడుకొని నేరుగా కాకినాడకు తరలిస్తున్నారనే విషయం మంత్రి నాదెండ్లకు తెలియకుండా ఉంటుందా అని ప్రశ్నించారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి నిజాలు తెలుసుకొని మాట్లాడాలని మంత్రిని కోరారు. ఇంకా వైఎస్సార్ సీపీపై ఆరోపణలు చేస్తామంటే ప్రజలు ఒప్పుకోరని పేర్కొన్నారు. ఈ వ్యాపారం ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసునని, నాటకాలు, డ్రామాలు ఆపాలని కోరారు. నిజంగా పాలకులకు చిత్తశుద్ధి ఉంటే కిందిస్థాయి నుంచి ఈ అక్రమ రవాణా ఆపేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలని గోపిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, నాయకులు, పడాల చక్రారెడ్డి, పచ్చవ రవి, పానుగోటి వెంకటరావు పాల్గొన్నారు.

భవితవ్యం ప్రశ్నార్థకం

- ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదుకోని కూటమి ప్రభుత్వం
- భవిత కేంద్రాల్లోని దివ్యాంగులకు అందని పరికరాలు
- వైఎస్సార్ సీపీ హయాంలో క్రమం తప్పకుండా పరికరాల పంపిణీ
- జిల్లాలో ఐదు ఫిజియోథెరపిస్ట్ పోస్టులు ఖాళీ
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఒక్కటే ప్రత్యేక శిబిరం నిర్వహణ
- నేడు ప్రపంచ వికలాంగుల దినోత్సవం



కారంపూడి భవిత కేంద్రంలో దివ్యాంగులు

సత్తెనపల్లి: మానసికంగా, శారీరకంగా అవస్థలు పడుతున్న దివ్యాంగ చిన్నారులకు వరంగా మారిన భవిత కేంద్రాలను కూటమి సర్కారు చిన్నచూపు చూస్తోంది. వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదు. ఏటా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి యంత్రపరికరాలను అందజేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం జిల్లాలోని 28 మండలాల్లో భవిత కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 511 మంది దివ్యాంగులు ఉన్నారు.

పరికరాలేవీ..!

ఈ ఏడాది మార్చి నెలలో అంటే గత ప్రభుత్వం ఉండగా సత్తెనపల్లిలో మాత్రమే క్యాంపు నిర్వహించారు. 156 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, ట్రై సైకిళ్లు, చంక కర్రలు, తదితర పరికరాలు అవసరమని నిర్ణయించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా చేరిన పిల్లల కోసం క్యాంపులు నిర్వహించలేదు. పరికరాలు అవసరమని గుర్తించిన విద్యార్థులకూ వాటిని అందించలేదు. తల్లిదండ్రులకు అందించే అలవెన్స్ కూడా ఇవ్వలేదు. నిధులు విడుదలయ్యాయి.. త్వరలో జమవుతాయని అధికారులు చెబుతున్నారు. నూతన విద్యాపాలసీ ప్రకారం ప్రస్తుతం పాఠశాల భవనాలనే భవిత కేంద్రాలుగా మార్చి అన్ని మండలాల్లో విద్యా, శిక్షణ ఇవ్వాల్సి ఉంది. జిల్లాలోని 28 మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు 3,119 మంది ఉన్నప్పటికీ భవితా కేంద్రాల్లో మాత్రం 511 మందే ఉన్నారు. మిగిలిన వారు సమీప పాఠశాలల్లో చదువుతున్నారు. భవిత కేంద్రాల్లో ఉన్నవారికి ప్రతి సోమవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించాల్సి ఉంది. అయితే జిల్లా వ్యాప్తంగా 10 మంది ఫిజియోథెరపిస్ట్‌లు ఉండాల్సి ఉండగా, కేవలం ఐదుగురే ఉండడంతో మిగిలిన వారిపై పనిభారం పడుతోంది. ఫిజియోథెరపిస్టులు చికిత్స చేస్తున్నా.. పరికరాలు అందకపోవడంతో వారి శ్రమ వృథా అవుతోంది.

వైఎస్సార్ సీపీ హయాంలో క్రమం తప్పకుండా

గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలలో కొత్తగా చేరిన పిల్లల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించి వారికి అవసరమైన పరికరాలను క్రమం తప్పకుండా అందజేసింది. అయితే ఈ ఏడాది ఇంతవరకు కూటమి ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిపెట్టలేదు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ప్రత్యేక అవసరాల చిన్నారులు:	3,119 మంది
భవిత కేంద్రాలు :	28
భవిత కేంద్రాల్లో ఉన్న దివ్యాంగులు:	511 మంది
జిల్లాలో ఐఈఆర్‌పీల సంఖ్య:	56
జిల్లాలోని ఆయాల సంఖ్య:	27
ఉండాల్సిన ఫిజియోథెరపిస్ట్‌లు:	10
ఫిజియోథెరపిస్టు ఖాళీలు :	05

త్వరలో యంత్ర పరికరాలు వచ్చే అవకాశం

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు యంత్ర పరికరాలు త్వరలో వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. భవిత కేంద్రాల్లో పిల్లలకు ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. అలవెన్సులు మొదటి విడతగా 830 మందికి రూ.22.80 లక్షలు వచ్చాయి. మిగిలిన వారికి రెండో విడతలో వస్తాయి.

– ఆర్.సెల్వరాజ్, ఐఈడీ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్, పల్నాడు

క్లుప్తంగా

బాలోత్సవాలు జయప్రదం చేయాలి



శావల్యాపురం: బాలోత్సవాలు అత్యంత వైభవంగా జరుతాయని జిల్లా బాలోత్సవ అధ్యక్షులు సి.హెచ్.రాజారెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోస్టర్ అవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఈనెల 28,29 తేదీల్లో జరగనున్న నరసరావుపేట పీఎన్‌సీఅండ్ కేఆర్ ప్రాంగణంలో బాలోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నట్టు వెల్లడించారు. బాలోత్సవాలకు 20 వేల మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. పోస్టర్ అవిష్కరించిన వారిలో బాలోత్సవ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల 23 మంది జూదరుల అరెస్టు

లక్ష్మీపురం: వేర్వేరు చోట్ల 23 మంది జూదరులను పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో నివాస గృహాల మధ్య ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు లేకుండా పేకాడుతున్న ఐదుగురు జూదరులను స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సోమవారం సాయంత్రం అరెస్టు చేశారు. దేవాపురం 3వ లైన్‌లోని ఆకుల రెసిడెన్సీ అనే అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బంది దాడి చేశారు. ఐదుగురు జూదరులను స్టేషన్‌కు తరలించి వారి వద్ద నుంచి రూ.84వేలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

■ బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో 18 మంది పేకాట ఆడుతున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఆకస్మిక దాడులు చేసి 18 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

రూ.కోటి విలువైన స్థలం కాజేతకు స్కెచ్

- సత్తెనపల్లిలో రక్షకభటుల స్థలానికి రక్షణ కరవు
- చక్రం తిప్పుతున్న టీడీపీ ద్వితీయశ్రేణి ముఖ్య నేత
- పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

సత్తెనపల్లి: స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ స్థలాన్ని కాజేసేందుకు కొందరు యత్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో టీడీపీ ద్వితీయ శ్రేణి ముఖ్య నేత చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. సత్తెనపల్లిలోని వడవల్లి 13వ వార్డులో సర్వే నంబర్ 23లో 5.92 రెండు ఎకరాల పట్టా భూమి ఉంది. ఈ భూమిలోని పది సెంట్లను అహోబిల భాస్కరరావు 1951లో సత్తెనపల్లి పోలీసు సర్కిల్ కార్యాలయానికి దానంగా ఇచ్చారు. ఆ స్థలంలో పోలీస్ సర్కిల్ కార్యాలయ ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించింది. అప్పటి నుంచి ఆ స్థలం ఖాళీగానే ఉంటుంది. రిటైర్డ్ తహసీల్దార్ సహకారంతో 2005లో కొందరు ఈ స్థలానికి పట్టాలు పుట్టించి ఇళ్ల స్థలాలుగా మార్చే యత్నం చేసినా అప్పటి ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. అనతరం స్థలాన్ని సబ్ డివిజన్ చేసి సర్వే నెంబర్ 23-1/ఏ-2 లో 91 లింక్‌లు వెడల్పు, 113 లింక్‌లు పొడవు కలిగిన 10 సెంట్లు స్థలంగా నిర్ధారించారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం.. ఈ స్థలం విలువ రూ.కోటి ఉంటుంది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ స్థలంపై కొందరి కన్ను పడింది. కొందరు తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయించాలని చూస్తుంటే కొందరు అప్పనంగా కొట్టేసేందుకు యత్నిస్తున్నారు.

విక్రయానికి దాత కుమారుడి యత్నాలు

అహోబిల భాస్కరరావు కుమారుడు అహోబిల విజయ వెంకటలక్ష్మి నరసింహారావు కొంత కాలం క్రితం ఆ స్థలం తమదేనని, తన తండ్రి దానమిచ్చారని, మధ్యవర్తుల ద్వారా స్థలాన్ని విక్రయించేందుకు యత్నాలు మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ముప్పాళ్ళ మండలం రుద్రవరానికి చెందిన కోటేశ్వరరావు అనే మధ్యవర్తి ద్వారా సత్తెనపల్లికి చెందిన ధూపకుంట్ల జానకి రామారావుకు విక్రయించేందుకు నిర్ణయించాడు. రూ.2.50 లక్షలు అడ్వాన్స్ తీసుకొని అగ్రిమెంట్ రాశాడు. అయితే స్థలం 22-ఏ జాబితాలో ఉండడంతో రిజిస్ట్రేషన్ కాలేదు. దీంతో అదే మధ్యవర్తి కోటేశ్వరరావు ద్వారా ఇటీవల పట్టణానికి చెందిన సంపత్ కుమార్‌కు సర్వే నంబర్ మార్పు చేసి అహోబిల వెంకట లక్ష్మీ నరసింహారావు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీ) చేశాడు. సంపత్ కుమార్ టీడీపీ ద్వితీయ శ్రేణి ముఖ్యనేతకు బినామీగా ఉన్నట్టు ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో తాను చెల్లించిన నగదు తిరిగి ఇవ్వకుండా మరొకరికి జీపీ చేయడం ఏమిటని మధ్యవర్తిగా ఉన్న కోటేశ్వరరావును జానకి రామారావు నిలదీయడంతో వివాదం రేగింది. దీంతో ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకోవడంతో ఈ వ్యవహారం పట్టణ పోలీస్ స్టేషన్‌కి చేరింది. ఈ వ్యవహారంలో టీడీపీ ద్వితీయ శ్రేణి ముఖ్యనేత చక్రం తిప్పుతున్నారని తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా.. పోలీస్ శాఖకు చెందిన స్థలాన్ని సంరక్షించేందుకు రెవెన్యూ, పోలీస్ శాఖలు చర్యలు తీసుకోవడం లేదు.



సత్తెనపల్లి వడ్డవల్లిలో పోలీస్ సర్కిల్ కార్యాలయానికి కేటాయించిన స్థలం

ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాలి

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 39 అర్జీలు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధ్యక్షత వహించి జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 39 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని, అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

నరసరావుపేటలో అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తూ ప్రజల ఆస్తులు కొల్లగొడుతున్న చిట్‌ఫండ్ అధినేత చల్లా శ్రీనివాసరావు, పల్ల నాయుడుబాబుపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జేసీ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. తొలుత కలెక్టరేట్ ముందు కొద్దిసేపు ధర్నా చేశారు. ఈసందర్భంగా పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ ఇద్దరు వ్యాపారులు కాల్‌మనీకి మించి వడ్డీభారం మోపుతూ ప్రజల ఆస్తులు కొల్లగొడుతున్నారని విమర్శించారు. జిల్లా ఎస్పీతో మాట్లాడి నిందితులపై చర్యలు తీసుకుంటామని జేసీ గనోరే హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, ఎంసీపీఐ నాయకులు అబ్రహం లింకన్, బాధితులు పాల్గొన్నారు.



రహదారుల అభివృద్ధికి చర్యలు

నరసరావుపేట రూరల్: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెట్లూరివారిపాలెం-కోటప్పకొండ రహదారిలో చేపడుతున్న రహదారి మరమ్మతు పనులను మంత్రి జనార్దన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. కోటప్పకొండకు చేరుకున్న మంత్రికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న రోడ్ల మరమ్మతు పనులపై ఆర్‌అండ్‌బీ ఈఈ రాజానాయక్‌తో మంత్రి సమీక్షించారు. అనంతరం కోటప్పకొండ రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. పల్నాడు జిల్లాలో 1,737 కిలోమీటర్ల విస్తీర్ణంలో రహదారులు ఉండగా 383 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయని చెప్పారు. రాజుపాలెం-బెల్లంకొండ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తున్నట్టు తెలిపారు. నాబార్డు నిధులతో రూ.142 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. కృష్ణానదిపై మాదిపాడు వద్ద రూ.60.54 కోట్లతో నాబార్డు నిధులతో చేపట్టనున్న బ్రిడ్జి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తిచేసినట్టు వివరించారు. జిల్లాలో 935 కిలోమీటర్ల రోడ్లకు రూ.38 కోట్లతో 133 మరమ్మతు పనులను చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, పలువురు అధికారులు పాల్గొన్నారు.



రోడ్ల మరమ్మతులపై చర్చిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి

సబ్ జూనియర్స్ విజేత ప్రకాశం జిల్లా ఎడ్ల జత



కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న ఎడ్ల పోటీలలో భాగంగా సోమవారం సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు జరిగాయి. పోటీలను మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, చప్పిడి రాము తదితరులు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పాడు మండలం, మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్ల జత బండను 2,600 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుంది. గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన యల్లం సాంబశివరావు ఎడ్ల జత 1,800 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానాన్ని, హైదరాబాదుకు చెందిన డి రోషన్‌బాబు ఎడ్ల జత 1,683 అడుగుల దూరం లాగి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులను గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ బాణావతు సరస్వతీబాయి బాలనాయక్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు, మాజీ ఎంపీపీ రామావతు నాగులునాయక్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, కంభంపాటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ గుండా బ్రహ్మయ్య, సంగినీడి బాలకృష్ణ అందించారు.

టీడీపీ వారి దురాగతాలపై చర్యల్లేవు

- పోలీస్ గ్రీవెన్స్‌లో ఎస్పీకి మహిళ వినతి
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 66 ఫిర్యాదులు

నరసరావుపేట: టీడీపీకి చెందిన వ్యక్తులు ఇంటిపై దాడిచేసి కొట్టారని, వారి దురాగతాలపై పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని, కేసు నమోదుచేయలేదని ఓ మహిళ జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎస్పీ అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి, తగాదాలు, మోసాలు వంటివాటిపై 66 ఫిర్యాదులు స్వీకరించారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల సమస్య వింటున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఇంటిపైకి వచ్చి కొట్టారు



సుమారు 20రోజుల క్రితం మా ఇంటి సమీపంలో ఓ నాలుగేళ్ల బాలుడిని నీరు వృథా చేయెద్దని మందలించినందుకు ఎం.రోశయ్య, రాణి, నెహేమియా సహా ఏడుగురు వ్యక్తులు మా ఇంటిపైకి వచ్చి కొట్టారు. టీడీపీకి చెందిన వీరిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేసినా కేసు నమోదుచేయలేదు. పోలీసు స్టేషన్‌లో పోలీసుల సమక్షంలోనే మళ్లీ కొట్టారు. దీనిపై రెండు వారాల క్రితం ఎస్పీ గ్రీవెన్స్‌కు వచ్చి ఫిర్యాదుచేశా. కేసు నమోదుచేయలేదు. మళ్లీ ఫిర్యాదు చేసేందుకు వచ్చా.

– మేకల అనూష, ముటుకూరు, దుర్గిమండలం

ఇంట్లోకి వచ్చి భయబ్రాంతులకు గురిచేశారు

నేను ఇంట్లో ఒంటరిగా ఉండగా బొమ్మిడి సుబ్బారావు అతని అనుచరులు ఇంటిలోకి వచ్చి 'నీ మొగుడు ఎక్కడ ఉన్నాడో చెప్పాలి' అంటూ దూషిస్తూ భయబ్రాంతులకు గురి చేశారు. పొలంలో వేసిన పైరు కూడా నాశనం చేశారు. వారిపై చర్యలు తీసుకోండి.

– యేలమ్మ, శ్రీరామాంజనేయపురం, బెల్లంకొండ

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.18 లక్షలు కాజేశారు

నాతోపాటు మరో పదిమంది స్నేహితుల వద్ద గుంటుపల్లి వెంకట మల్లికార్జునరావు అనే వ్యక్తి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.18 లక్షలు తీసుకున్నాడు. అతను ఉద్యోగాలు ఇప్పించకుండా, తిరిగి డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని మా డబ్బులు ఇప్పించండి.

– శివాంజనేయులు, పిడుగురాళ్ల

పేకాట, కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

- 8 బైకులు, 9 సెల్‌ఫోన్లు, రూ.1.03 లక్షలు స్వాధీనం
- 8 మందిపై కేసు నమోదు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని రవ్వారం కొండ వెనుక డంపింగ్ యార్డులో సాయంత్రం 5 గంటల సమయంలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.లక్ష 3 వేల 500 నగదు, 8 బైక్‌లు, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు సోమవారం తెలిపారు. ఐనవోలు పోలీసు స్టేషనులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐతోపాటు ఎస్ఐ కృష్ణారావు, ఎస్‌బీ పోలీసు అధికారి మస్తాన్‌వలీ, రైటరు విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు అదుపులో జూదరులు

బాలిక హత్య కేసు ఛేదించిన పోలీసులు

- నాలుగు నెలలు తర్వాత గ్యాస్ డెలివరీ బాయ్ అరెస్ట్
- క్లూ లభించకుండా నిందితుడు పలు రాష్ట్రాల్లో సంచారం
- సాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ గుర్తింపు

నగరంపాలెం: బాలికను హత్య కేసులో చిక్కుముడి వీడింది. ఈ ఘటనలో గ్యాస్ డెలివరీ బాయ్‌ని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో ఈ ఏడాది జూలై 15న కుమార్తె హత్యకు గురైనట్లు తండ్రి చేబ్రోలు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. హత్య ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు, పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణతోపాటు సీసీఎస్, ఎనిమిది బృందాలతో నిందితుడి ఆచూకీ కోసం జల్లెడ పట్టారు. అప్పటి నుంచి అతడు ఎటువంటి ఆధారాల్లేకుండా నాలుగు నెలలకు పైగా కానరాలేదు. ఏపీతోపాటు, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలోనూ గాలించారు. సీసీటీవీ పుటేజ్, లైవ్ ట్రాకింగ్, సామాజిక మాధ్యమాలు, సాంకేతిక ఆధారాలు, వ్యక్తుల సమాచారంతో గుంటూరు, విజయవాడ, హన్మకొండ, హైదరాబాద్, విశాఖపట్నం, నర్సీపట్నం, తిరుపతి పరిసర ప్రాంతాల్లోనూ గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసుపై పదిహేను రోజులకు ఒకసారి పోలీస్ బృందాలతో సమీక్ష నిర్వహించారు.

పలుచోట్ల బస

బాలికను హత్య చేసిన నాగరాజు గుంటూరు నుంచి బస్‌లో తొలుత విజయవాడ వెళ్లాడు. అక్కడ్నుంచి రైల్లో హన్మకొండలో దిగి అక్కడ బస చేశాడు. అనంతరం హైదరాబాద్, విశాఖపట్నం, పీఠాపురం, రాజమండ్రి, తిరుపతి, తమిళనాడులోని తిరుపూరు స్పిన్నింగ్ మిల్లులో పనిచేసి, రాజమండ్రి చేరాడు. అక్కడ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న నాగరాజుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, బాలిక తల్లితో అతనికి వివాహేతర సంబంధం ఉండేది. వారి మధ్య విబేధాలు వచ్చాయి. ఈ క్రమంలో తల్లిపై కోపంతో బాలికను హత్య చేశాడు. నాలుగు నెలలకు పైగా ఎటువంటి ఆధారాల్లేకుండా తిరుగుతున్న నాగరాజుని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన తెనాలి డీఎస్పీ జనార్దన్‌రావు, పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సీసీఎస్ పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. సీఐ వై.కోటేశ్వరరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ అభిలాష్‌కు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా

నిందితుడు స్పిన్నింగ్ మిల్, గ్యాస్ గోదాంలో పనిచేసేవాడని తెలియడంతో ఆయా ప్రదేశాల్లోనూ వెదికారు. కేసును ఛేదించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పలు ప్రాంతాల్లోనూ నిఘా ఉంచారు. గతంలో ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో రజనీని గొంతు నులిమి హత్య చేయగా, అప్పట్లో పనులు చేసుకుంటూ కర్ణాటకలోని గుల్బర్గా, మహారాష్ట్రలోని సోలాపూర్‌లో మకాం వేశాడని తెలిసి, అక్కడ గాలించారు. ఈ క్రమంలో రాజమండ్రిలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్నాడనే సమాచారంతో పొన్నూరు రూరల్ పీఎస్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు పీఎస్ ఎస్ఐ డి.వెంకటకృష్ణ సిబ్బందితో వెళ్లి నాగరాజుని అరెస్ట్ చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి ఆచూకీ కనుగొన్నారు.

పట్టువదలని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు పట్టువదలకుండా దీక్షను కొనసాగిస్తున్నారు. శిబిరాన్ని కూల్చివేసినా తిరిగి నిర్మించుకున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పోరాట శిబిరాన్ని కూల్చివేసినా తిరిగి కార్మికులంతా ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని సీఐటీయూ తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. సోమవారం ఆయన పోరాట శిబిరాన్ని సందర్శించి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అధికారులు కనీస నిబంధనలను కూడా పాటించకుండా 200 గుడిసెలను అక్రమంగా కూలగొట్టడం అన్యాయమని ఖండించారు. ఏఐటీయూఎఫ్ నాయకులు కోటయ్య మాట్లాడుతూ కార్మికుల పట్టుదలను దెబ్బతీయడం కోసం ప్రభుత్వమే ఇళ్లను కూల్చివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పోరాటానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కె.స్టీవెన్, బి.అంకయ్య, బి.సూర్యప్రకాష్, ఎం.ఆశీర్వాదం, వై.యెహోషువా, కె.ఆదినారాయణ, రమాదేవి, ఎం.శారద, సామ్రాజ్యం, ఎం.గురవయ్య, సాంబశివరావు, సుబ్బారావు, యస్‌కె.ఆరిఫ్, సీపీఎం నాయకులు ఎం. పకీరయ్య పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ నాయకులపై
కేసులు పెట్టి వేధింపులు

- మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజం
- కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతి

నరసరావుపేట: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులను కేసులు పెట్టి వేధిస్తోందని నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. న్యాయస్థానాల్లో కొట్టివేసిన కేసుల్లోనూ నేరం ఒప్పుకోవాలని పోలీసులు వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. రొంపిచర్ల మండలం రామిరెడ్డిపాలెం, కర్లకుంట గ్రామాల్లో జరిగిన రెండు ఘటనల గురించి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ సూరజ్ గనోరే దృష్టికి తీసుకెళ్లి గోపిరెడ్డి వినతిపత్రం సమర్పించారు. అనంతరం గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ రొంపిచర్ల మండలం రామిరెడ్డిపాలెంలో 2019లో ఆ ఊరి శ్మశాన వాటిక ప్రహరీ, ఆర్చ్‌లను వైఎస్సార్ సీపీ నాయకులు రాజనాల నాగిరెడ్డి, వెంకటరెడ్డి ధ్వంసం చేశారని అప్పటి మాజీ సర్పంచ్ కోర్టులో కేసు వేశారని, విచారణ అనంతరం వీరిద్దరూ నిర్దోషులుగా కోర్టు తేల్చిందని, అయితే ఇప్పుడు రాజనాల నాగిరెడ్డిని పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి నేరం ఒప్పుకోవాలని బెదిరిస్తున్నారని వివరించారు. కర్లకుంట గ్రామంలో దారపనేని అక్కయ్య గత ప్రభుత్వ హయాంలో సచివాలయ నిర్మాణం చేశాని, దాని తాలూకు బిల్లు పెండింగ్‌లో ఉండగా రెండు నెలల క్రితం రూ.2.79 లక్షల చెక్కు పంచాయతీ ఖాతాకు జమైందని, ఆ చెక్కుకోసం రెండు నెలల నుంచి అడుగుతుంటే సర్పంచ్ ఇచ్చేందుకు ముందుకు వచ్చినా, పంచాయతీ కార్యదర్శిపై కూటమి నేతలు ఒత్తిడి తీసుకొచ్చి చెక్కు ఇవ్వకుండా వేధిస్తున్నారని గోపిరెడ్డి ఆరోపించారు. నీటి సంఘాల ఎన్నికలు సమీపిస్తున్నా నరసరావుపేట, రొంపిచర్ల మండలాల తహసీల్దార్లు ఓటర్ జాబితాలు ఇవ్వకుండా దాగుడుమూతలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ విషయాలన్నీ జేసీ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట మండల కన్వీనర్ పచ్చవ రవీంద్రబాబు, నాయకులు పడాల చక్రారెడ్డి, పానుగోటి వెంకటరావు పాల్గొన్నారు.